విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 10, జూన్ 2023

నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ఉద్యోగం ఉపాధి కోసం ఉద్యమిద్దాం

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం : నైపుణ్యం కలిగిన విద్య మెరుగైన వైద్యం,ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు యువత సన్నద్ధం కావాలని సీపీఐ అనుబంధం ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పేర్కొన్నారు.ఈమేరకు జూన్ 27నుండి 30వరకు గుంటూరు జిల్లాలో నిర్వహించ బోతున్న రాష్ట్రస్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని యువతకు పిలుపునిస్తూ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్లో యువజన విభాగం నాయకులతో కలసి శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదన్నారు.నేటి యువతలో ప్రగతిశీల అభ్యుదయ భావాలు,ప్రజాస్వామిక ఆలోచనలను,నైతిక విలువలను మానవత్వాన్ని మేలుకొల్పడానికి అఖిల భారత యువజన సమాఖ్య నిరంతరం కృషి చేస్తోందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులకు ఓటు హక్కుకోసం పోరాడి సాధించిన ఘనత ఎఐఎస్ఎఫ్ దే నని గుర్తు చేశారు.మతోన్మాదానికి వ్యతిరేకంగా మార్పుకోసం "సేవ్ ఇండియా - ఛేంజ్ ఇండియా" అనే నినాదంతో దేశ వ్యాప్తంగా ఉద్యమించిందన్నారు. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తూ పలురకాల పరీక్షల పేరుతో పేదల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రులు, క్లినికల్ ల్యాబ్ యాజ మాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు,యువత, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని రూపకల్పన చేసేందుకు అనుభవం కలిగిన మేధావులు, రాజకీయ నేతలు, అధ్యాపకులు, విద్యావంతులు, కళాకారులతో జూన్ 27,28, 29,30 వరకు గుంటూరు జిల్లాలో యువతకు శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నారన్నారు. రాష్ట్రవ్యాపితంగా 26 జిల్లాల నుండి 1000 మంది యువజన సమాఖ్య కార్యకర్తలు, విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక శిక్షణా సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. శిక్షణ తరగతులకు పెద్ద ఎత్తున యువతీ యువకులు తరలి రావాలని పిలుపునిచ్చారు.ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్, ఉపధ్యక్షుడు మోహన్ కృష్ణ ,సహాయ కార్యదర్శి రాకెట్ల రాము,నగర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్,నాయకులు లిఖిల్ యాదవ్,నవీన చౌదరీ, సాయి పాల్గొన్నారు.

రైతు గర్జన ప్రచార జాత జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఉరవకొండ : అనంతపురం జిల్లాలో రైతు లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ శనివారం ఉర వకొండలో ఉదయం 10గంటలకు అంబేద్కర్ విగ్రహం నుంచి రైతు గర్జన ప్రచార జాతను ప్రారంభించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీనియర్ న్యాయవాది ఐదుకల రవీంద్ర, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు ఉరవకొండ తాలూకా సీపీఐ సహా య కార్యదర్శి కురుగుంట మనోహర్ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బోయ గోపాల్ తెలిపారు. ఈ జాతకు సంబంధించిన పోస్టర్లను శుక్ర వారం ఉరవకొండలో సీపీఐ కార్యాల యంలో విడుదల చేశారు. మాట్లాడుతూ హెచ్ ఎల్సి కాలువను ఆధుని కరణ చేయాలని, హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి మరొ క సమాంతర కాలం నిర్మాణం చేపట్టాలని, కర్ణాటకలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న అప్పర్ భద్ర నిర్మాణ పనులు ఆపాలని రైతులకు అందాల్సిన పంట నష్ట పరిహారం,పంటల బీమా తక్షణ మే మంజూరు చేయాలని,తదితర డిమాండ్లతో రైతు గర్జన ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సీపీఐవజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, సీపీఐ నాయకులు హనుమంతు, నాగేంద్ర పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - తాడిపత్రి : పెద్దపప్పూరు మండలంలోని పెద్ద

పప్పూరు-1,నర్సాపురం, పసలూరు గ్రామ సచివాలయాలను శుక్రవారం డివిజినల్ డెవలప్మెంట్ అధికారి ఓబులమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది యొక్క బయోమెట్రిక్ హాజరు,వైస్సార్ భీమ, తెస్తిమోనియల్స్, ఈ-సర్వీసెస్, ఎస్డిజీస్ సర్వే ప్రగతి గురించి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాల న్నారు. గ్రామంలో అర్హులై ఉండి టెక్నికల్ ప్రాబ్లమ్స్ తో సంక్షేమ పథకాలు అందనిచో వెంటనే పై అధికారుల సంప్రదించి వాటిని పరిష్కరించి వారికి సంక్షేమ పథకాలు అదేవిధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు వాలంటీర్లకు తగిన సూచనలు జారీ చేశారు. ఎంపిడిఓ రామక్రిష్ణ, ఈఓఆర్డి కమలాబాయి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంట్రన్స్ పరీక్షలో విజన్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-యాడికి : ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి ఎంట్రన్స్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో విజన్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం కొనసాగుతున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ తెలిపారు. ఎంట్రన్స్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో విజన్ విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రతిభతో స్టేట్ 27 వ ర్యాంక్తో యస్.మల్లికార్జున రావు, 46 వ ర్యాంక్ తో స్వాతి,342 ర్యాంక్ తో గుండా లోకేష్, 774ర్యాంక్తో సాయి జశ్వంత్ పార్థు,780 ర్యాంక్తో శ్రీనిధికుమార్,1309 ర్యాంక్ తో నాగేష్,1537 ర్యాంక్తో కృష్ణ చేతన్ సీట్లు సాధించారు .సబ్జెక్ట్ నాలెడ్జ్ పుష్కలంగా ఉన్నవారే ఇటువంటి పరీక్షల్లో సీట్లు సాధించడం జరుగుతుందనివిజన్ యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

తాగునీరు కలుషితం

విశాలాంధ్ర-విడపనకల్లు : మండల పరిధిలోని ప్రధాన చెరువు నుండి పలు గ్రామాల్లో వెళ్లె తాగునీటి సరఫరా అవుతున్న కాని పైప్ లైన్ లీకెజి అవుతున్నాయి. అసలే వేసవి ఎండలతో ప్రజలు నీళ్లకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది చాలదన్నట్లు పైప్లైన్ లీకేజీలతో నీరు వృథా పోతున్నా, తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉన్నా అధికారులు కనీసం స్పందించడం లేదు. మండల కేంద్రంలోని జి బి సి కాలువ ఆరో డిస్ట్రిబ్యూటర్ వద్ద వేల్పుమడుగు, ఆర్ కొట్టాలకు సరఫరా అవుతున్న ప్రధాన పైప్లైన్ లీకేజ్ కావడంతోటి తాగునీరు కలుషితం అవుతూ వృధాగా వెళుతున్న నీరుని జీబీసీ కాలువలో వెళ్ళి ఈనీరు అక్కడ దోబీ ఘాటుకు నీటిని ఉపయోగించుకుంటున్నారు. అసలే వేసవికాలంలో తాగునీటి తీవ్రంగా ఎద్దడిగా ఉండటంతో కొందరు ఈ నీటిని దోబీ ఘాటు కూడా ఉపయోగించుకుంటున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో పైప్లైన్ల లీకేజీ కారణంగా సరిగా నీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

రీ-మోడల్ సైన్స్ బ్లాక్ ప్రారంభం

విశాలాంధ్ర - జెఎన్టీయుఏ : జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల లో కొత్త గా రీ-మోడల్ చేసిన సైన్సు బ్లాక్ నుశుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ఆచార్య కె. హేమ చంద్రా రెడ్డి, ఉపకులపతి ఆచార్య జింక రంగా జనార్ధన్ ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. సైన్సు బ్లాక్ లో గణిత, రసాయన, భౌతిక శాస్త్ర విభాగాలతో పాటు ల్యాబ్ లు, తరగతి గదులు, సెమినార్ హాలు లు , ఓటిపిఆర్ఐ మూడవ ఫ్లోర్ ప్రారంభించడం వల్ల విద్యార్థులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ ,యూనివర్శిటీ ఇంజినీర్ మహమ్మద్ జహీర్ అస్లాం , యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, డైరెక్టర్ బి. దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.గోపీనాథ్, బోధన, బోధనేతర ఔట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు గర్జన ప్రచార జాతను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కూడేరు : నీటి సాధనకై ఈనెల 10 నుండి 20 వరకు చేపట్టిన రైతు గర్జన ప్రచార జాతను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు కరపత్రాలను మండల వ్యాప్తంగా పంపిణీ చేశారు. హెచ్ఎల్సి ఆధునికరణ పనులు చేపటాలని, రైతులు రుణమాఫీ చేయాలని, హంద్రీనీవా కాలవ వెడల్పు చేపట్టాలని, తదితర డిమాండ్లతో చేపట్టిన ఈ జాతాకు మండలం నుండి అధిక సంఖ్యలో రైతులు నాయకులు పాల్గొని జయప్రదం చేయా లని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పెరుగు సంగప్ప, రమణ,సీపీఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల రాయుడు కోరారు.

సీపీఐ పోరాట పటిమను గడప గడపకు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర - బ్యూరో అనంతపురం : ప్రజా సంక్షేమం కోసం సీపీఐ నిర్వహిస్తున్న పోరాట పటిమను గడప గడ పకు తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ శ్రేణుల కు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్లో సీపీఐ నగర కార్యవర్గ సమా వేశం నిర్వహించారు.నగర కార్యవర్గ సభ్యుడు గాదిలింగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాఫర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలకు సీపీఐ శ్రేణులు కుటుంబ సభ్యులతో సహా హాజ రుకావాలన్నారు.జిల్లా నీటి సాధన కోసం ఈనెల10 నుండి 20వరకు జరుగనున్న రైతు గర్జన ప్రచార జాతాను విజయవంతంగా కొనసాగించాలన్నారు. అణగారిన ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కా రానికి సీపీఐ శ్రేణులు ముందుండి పోరాడాలని పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చెయ్యాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, జిల్లాకార్యవర్గసభ్యుడు లింగమ య్య, నగరసహాయకార్యదర్శులు రమణ అల్లిపీర, ఎఐవైఎఫ్ జిల్లాకార్యదర్శి సంతోష్కుమార్, మహిళా సమాఖ్య నగర అధ్యక్షకార్యదర్శులుజానకి,కుర్శిదబేగం, సీపీఐ జిల్లా సమితిసభ్యుడు ఈశ్వరయ్య,అర్బన్బ్యాంక్డైరెక్టర్లుబంగారుబాష,రామాంజినేయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర-గుంతకల్లు : ధర్మవరం నుండి బదిలీపై గుంతకల్లు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన వి మల్లికార్జునకు సీపీఐ నాయకులు ఏఐటిసి నాయకులు సీపీఐ నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య మర్యాదపూర్వకంగా కలిసి పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. వీరభద్రస్వామి మాట్లాడుతూ... అప్కాస్ వర్కర్లకు రిటైర్డ్ అయిన వారి వారసులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. సరెండర్ లీవు డబ్బులు ఇవ్వాలని కోరారు. నాలుగు ఐదు సంవత్సరాలు అవుతున్న ప్రొబేషన్ డిక్లేర్ చేయకుండా ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా వారియర్స్ లు వెంటనే ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు న్యాయమైన పనిముట్లు ఇవ్వాలని తెలిపారు. ఓహెచ్ ఏప్రిల్ మే నెలల ఇవ్వాలన్నారు. రిటైర్డ్ ఆయన మరణించిన కార్మికులకు డి ఏ వారియర్స్ సి ఎస్ ఎస్ సస్పెండ్ అకౌంట్ లో ఉందని కావున డబ్బులను ఇప్పించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిన్న కొండయ్య ,జె.నరసయ్య నాయకులు చిన్న ,కుమార్ ,నాగరాజు, దాస్, కార్తీక్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటింజెంట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - అనంతపురం వైద్యం : జిల్లా ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కంటిం జెంట్ ఉద్యోగులకు జీఓ 549, తేదీ 26.10.2019 ప్రకారం నెలకు 16,000/- రూపాయలు వేతనాలు చెల్లించాలని డిఎంఅండ్ఎచ్ఓ డాక్టర్ వీరబ్బాయి ని కలిసి వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. వారు మాట్లాడుతూ దాదాపు 25నుండి 30 సంవత్సరాలుగా పిఎచ్సిలలో కంటింజెంట్ ఉద్యోగులుగా పని చేస్తున్నామన్నారు. ప్రభుత్వము వెంటనే పెంచిన జీతాలు చెల్లించాలని జిల్లా ఎన్జీవో సంఘం తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. చంద్రశేఖర్ రెడ్డి, డి. చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. జమీలా బేగం , ప్రభుత్వ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు యూ.కుళ్లాయప్ప, నాయకులు గౌసేపీరా,నాగభూషణం ,పెద్దన్న తోపాటు కంటిన్జెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీబీసి సాగునీరు ప్రతి డిస్ట్రిబ్యూటర్కు వెళ్లాలి

విశాలాంధ్ర - విడపనకల్లు : మండలంలోని నింబగల్లు హంద్రీనీవా ప్రధాన కాలువ నుండి జీరో బై జీరో వద్ద జీబిసి ప్రధాన డ్రిస్టిబ్యూటర్ లకు కాలువలకు సాగునీరు అందడం లేదని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర సంఘం నాయకుడు శివన్న, కార్మిక సంఘం నాయకుడు చెన్నారాయుడు శుక్రవారం విడపనకల్లు మండల సమీపంలోని ఆరో డిస్టిబ్యూటర్ కాలువ వద్ద ఆధునికరుణలో నాణ్యత లోపం పరిశీలించారు. విలేకరులతో సీపీఐ శివన్న మాట్లాడుతూ జీబీసీ కాలువలో సాగునీరు బెడ్డింగ్ లో వృధాగా వెళుతున్నాయన్నారు. జీబీసీ కాలువలో కంప చెట్లు, జమ్మూ విపరీతంగా పెరిగిందన్నారు. దీంతో కాలువ సైడు గోడలు నెర్రలు చీలి నీరు వృధాగా వంకకు పోతున్నాయన్నారు. గతంలో జీబీసీ కాలువ ఆధునీకరణకు రూ. 250 కోట్లు గతప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆధునీకరణ బిల్లులు కాకపోవడంతో ఆధునికరుణపనులు ఆగిపోయాయన్నారు.కాలువ పనులు నాణ్యతతో చేయలేదన్నారు. జీబిసి కాలువ కింద సాగు రైతులు 328 వేలు మంది ఉన్నారన్నారు. జీబిసి కింద హావలిగి, కరకముక్కల, పాల్తూరు, విడపనకల్లు, దోనేకల్లు, గడేకల్లు,తిమ్మాపురం,పెంచాలపాడు, ఆర్ కొట్టాల , గాజులమల్లాపురం, రాయంపల్లి, నెరమెట్ల గ్రామాల రైతులు జీబిసి కసలువ పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. జీబిసి కాలువలో మట్టి చేరి, కంపచెట్లు పెరిగి కాలువ కు ఇరువైపులా సైడు వాల్స్ దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా జీబిసి కాలువలో ఆధునీకరణ పనులు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మినీ మ్యానిఫెస్టోని గడప గడపకు వెళ్లి వివరించండి

విశాలాంధ్ర-రాప్తాడు : ఏపీ రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టోను గడపాలని గడపకూ వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. రాప్తాడు టీడీపీ కార్యాయంలో శుక్రవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలసి మినీ మ్యానిఫెస్టో మీద చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన పార్టీ అధినేత చంద్రబాబు ఆరు అద్భుతమైన పథకాలతో మినీ మ్యానిఫెస్టోని తీసుకొచ్చారన్నారు. ఇందులో మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ సురక్షిత మంచినీరు, బీసీలకు రక్షణ చట్టం, పూర్ టూ రిచ్ పథకాలు ఉద్దేశ్యం ఏంటి.. దాని వలన ఏ విధంగా లబ్ధి జరగనున్నది అని సునీత వివరించారు. వీటిని గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఇంటికి చేర్చాలని, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించి.ఈ పథకాల గురించి వివరించాలన్నారు. నియోజకవర్గంలో ఒక్కసారి ఓటమికి చాలా మంది బాధపడ్డారని.. వచ్చే ఎన్నికల్లో భారీ విజయం సాధించాలంటే.. శ్రేణులంతా మళ్లీ ఉత్తేజంగా పని చేయాలన్నారు. పార్టీలో అందరూ సమానమేనని..మన లక్ష్యం చంద్రబాబుని మరోసారి సీఎం చేయడమే లక్ష్యమ న్నారు. నియోజకవర్గంలో ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ వీడకుండా బలంగా నిలబడ్డారని..వారిని పార్టీ ఎప్పటికీ మర్చిపోదన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అందరూ కష్టపడాలని.. మినీ మ్యానిఫెస్టోని జనంలోకి బాగా తీసుకెళ్తే.. మన విజయం దాదాపు ఖరారైనట్టేనని సునీత అభిప్రాయపడ్డారు. చిన్న చిన్న బేదాభిప్రాయాలను పక్కన పెట్టి అంతా కలిసి పని చేయాలని పిలునిచ్చారు.

కళ్యాణదుర్గం టౌన్ : తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా మినీ మేనిఫెస్టోను చూసి వైయస్సార్ పార్టీ నేతలలో వణుకు పుట్టింది అని మాజీ శాసనసభ్యులు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉన్నం హాజరై వారు మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోను చూసి వైసీపీలు వణుకు పుట్టిందని, మొత్తం మేనిఫెస్టోను చంద్రబాబు ప్రకటిస్తే వైసీపీలో అభ్యర్థులు ఉంటారో లేదో అనే పరిస్థితి నెలకొందన్నారు. రాయలసీమ డిక్లరేషన్ పేరుతో నారా లోకేష్ గారు ప్రకటన చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. సీనియర్ తెదేపా నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్ చౌదరి, పాపం పల్లి రామాంజనేయులు, యువ నాయకులు మారుతి చౌదరి, ఆర్జి శివశంకర్ ,పార్లమెంట్ ఉపాధ్యక్షులు వైపిరమేష్, మండల అధ్యక్షులు గొల్ల వెంకటేశులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - విడపనకల్లు : మండల పరిధిలోని పాల్తూరు పంచాయతీ పరిధిలోని గాజుల మల్లాపురం గ్రామంలో గడప గడప కార్యక్రమంలో భాగంగా మంజూరైన 20లక్షల నిధులతో క్యాంప్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం గ్రామ సర్పంచ్ బ్యూలారాణీ రాజశేఖర్, కాంట్రాక్టర్ సుధాకర్ రెడ్డి, వార్డు సభ్యులు శంకర్ గౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్ వీరేష్ పనులు పరిశీలించారు.

సచివాలయాలను ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - యాడికి : మండల పరిధిలోని వేములపాడు గ్రామంలోని సచివా లయంని ఎంపీడీవో లక్ష్మి నారాయణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలోని సిబ్బంది హాజరు రిజిస్టర్ ను, పలు రికార్డులను ఎంపీడీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అదేవిదంగా సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ చేరువ చేసేందుకు సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

గర్భవతులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర-ఉరవకొండ : గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ నాయక్ పేర్కొన్నారు.ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ గర్భవతులు రక్తహీనతకు గురికాకుండా మంచి పోషకాహారం తీసుకోవాలని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.అతిసార నివారణ కార్యక్రమం గురించి వివరిస్తూ వర్షాకాలంలో కలుషిత నీరు,ఆహారం వలన పిల్లలు అతిసార బారిన పడేఅవకాశం ఉన్నందున కాచి నీటిని తాగాలని,ఆహార పదార్థాలలో ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,ఎవరైనా పిల్లలు వాంతులు,విరేచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణం త్రాగిస్తూ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.లింగవివక్ష సరికాదన్నారు.ఆడమగ సమానమేనని ఎవరైనా స్కానింగ్ చేయించి భ్రున హత్యలకు పాల్పడిన వారిని గుర్తించి తగిన శిక్ష పడేలా చేస్తామని హెచ్చరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, హెల్త్ సూపర్వాసర్ శేఖర్,సీఓ భగవాన్ దాస్, స్టాఫ్ నర్సులు సరస్వతి,సునీత,ల్యాబ్ టెక్నీషియన్ రాణి ఎస్తర్,ఎంఎల్హెచ్ పి లు భవాని భారతి రూప హెబ్సిబా,ఎఎన్ఎమ్ లు అనూష పద్మావతి లలిత సలీమా ఇంతియాజ్ మొదలైన వారు పా

పిల్లకాలువలను ఏర్పాటు చేసి నీరు అందించండి

విశాలాంధ్ర-గుంతకల్లు : గ్రామాలకు పిల్లకాళల ద్వారా నీరు అందించాలని ప్రభుత్వానికి ఒత్తిడి చేయడానికి ప్రచారంలో భాగంగా శుక్రవారం నెలగొండ వెంకటం పల్లి, నాగసముద్రం అయ్యావారిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ ప్రచారంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సీపీఐ మండల కార్యదర్శి పి రాము రాయల్, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు,సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర పాల్గొన్నారు. మాట్లాడుతూ... సీపీఐ పోరాట ఫలితంగా కసాపురం తూము ఏర్పడి ఆ బాగా నా కొద్ది వరకు తడి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. మరి అదే విధంగా రాగులపాడు దగ్గర తూమును ఏర్పాటు చేసి పామిడి మండలం గ్రామాల వరకు హంద్రీనీవా సాగు త్రాగునీరు చెరువులకు కుంటలకు ఇవ్వాలని సిపిఐ మండల పార్టీ పార్టీలకు అతీతంగా రైతులను సమీకరించి ఈనెల 11వ తేదీన నెలగొండ గ్రామంలో సాగు త్రాగునీరు కోసం రైతు సదస్సును ఏర్పాటు చేయబోతున్నాం ఈ కార్యక్రమానికి నియోజకవర్గ అపరాధ భగీరథుడు అయినటువంటి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ డి.జగదీష్ ముఖ్య అతిథిగా గ్రామ పెద్దలు క్షేమం కోరే మొదలగువారు పాల్గొనబోతున్నారు.సీపీఐ మండల పార్టీ ఆధ్వర్యంలో మూడవరోజు ప్రచారంలో భాగంగా నెలగొండ వెంకటం పల్లి, నాగసముద్రం అయ్యావారిపల్లి తదితర గ్రామాలలో కరపత్రాలు పంచుతూ రైతులను చైతన్య పరుస్తూ రైతు సదస్సును జయప్రదం చేయవలసిందిగా కోరారు.రాష్ట్ర సమితి సభ్యులు మురళీకృష్ణ,డిహెచ్ పిఎస్ నాయకులు మల్లయ్య, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మైండ్ ట్రీ టెక్నాలజీని సందర్శించిన విద్యార్థులు

విశాలాంధ్ర - జె ఎన్టీయుఏ : మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ మూడో సంవ త్సరం విద్యార్థులు పారిశ్రామిక అన్వేషణలో భాగంగా ఎల్టిఐ మైండ్ ట్రీ టెక్నాలజీని బెంగళూరులోని కేంద్రాన్ని సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా సి.యువరాజు తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్న టీం సభ్యులతో డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటరింగ్, సైబర్ టెక్నాలజీ మొదలగు కోర్సులపై శిక్షణ నైపుణ్యాల కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులతో టీం సభ్యులు వివిధ అంశాలపై చర్చించారు. నియామకాల అధికారి ద్రుపద్ వర్మ, ట్రైన్ కవిప్రియ, జున్నుబాబు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - యాడికి : యాడికి మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలో ఉన్న 4వ,7వ నెంబర్ అంగన్వాడి సెంటర్లను సివిల్ సప్లయిస్ ఉప తహసిల్దార్ ఎం.కె సూర్యనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. సూర్యనారాయణ అంగన్వాడి కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించి,ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేయాలని,ఎండల తీవ్రత దృష్ట్యా బయట తిరగకుండా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. విఆర్ఓ కుమార్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార ప్రభావంతో ఆసుపత్రి పాలైన పిల్లలు

విశాలాంధ్ర - కణేకల్లు : కనేకల్ మండలంలోని చాపలి కాలనీ అతిసారకు ప్రభావంకు గురైన 15మంది పిల్లలు ఆసుపత్రి పాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నివాసం ఉండే స్థలంలో ఎలాంటి వసతులు లేవని కాలనీ వాసులు వాపో యారు. తాగడానికి నీరు కూడా కలుషితం కావడం, పైప్లైన్ సరింగ లేకపోవడం, వర్షం వచ్చినప్పుడు నీళ్లు నిలువ ఉండడం, అనేకమైన సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నమని చాప్లి కానీ ప్రజలు లబోదిబో మంటున్నారు. పరిశుద్ధ కార్మికులు కానీ ఇక్కడకు వచ్చి శుభ్రం చేసిందేమీ లేదని, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా ఏ అధికారి కూడా ఇక్కడికి వచ్చిన దాఖలాలు లేవని ప్రజలు వాంపుతున్నారు. ఇప్పటికైనా పంచా యతీ అధికారులు, ఆరోగ్య అధికారులు తమ నిర్లక్ష్యాన్ని విడనాడి, అతిసార ప్రభావం నుండి కాపాడాలని కాలనీప్రజలు కోరుకుంటున్నారు.

రైతుకు ఇబ్బంది లేకుండా చూడండి

విశాలాంధ్ర-విడపనకల్లు : మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి హాజరు కావడం జరిగింది. ఎంపీపీ మరియు వ్యవసాయ అధికారి మాట్లాడుతూఉన్న విత్తనాలను, ఎరువు లను వ్యవసాయ పరికరాలు సకాలంలో అందుబాటులో ఉండే విధంగా తగుజాగ్రత్తలు తీసుకోవాలని, సకాలం లో ప్రతి రైతు సీజన్ కు అనుగు ణంగా రైతు సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్లాలని తెలిపారు. విడపనకల్ వైసీపీ నాయకుడు కరణం భీమిరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు మాళాపురం జయరాంలు, వివిధ గ్రామ సచివాలయాల వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు పంపిణీ చేయండి

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని 17వ వార్డు నందు సర్వే నంబర్ 668లో కొంత ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు చదును చేసుకుని ఇతరులకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నారని శుక్రవారం సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాముల నేతృత్వంలో తాహసిల్దార్ స్వర్ణలతకు వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా పేదలకు పట్టాలు పంపిణీ చేయడానికి కృషి చేయాలని, లేదంటే ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించుకోవడానికి తగిన బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా ప్రకటించి ఇతరులు ఎవరిని ప్రవేశించకుండా చూడాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం వలన పేదవారికి అన్యాయం జరుగుతుందని, కావున అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరసింహ, వెంకటేశులు, కిష్టప్ప, వెంకట్రాముడు, రామకృష్ణ, పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు పేదలకు ఇవ్వాలి

విశాలాంధ్ర - హిందూపురం : గతప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలు కోసం కోటిపివద్ద టిడ్కో ఇండ్లను లబ్ధిదారుల వద్ద డిపాజిట్ కట్టించుకుని, 80శాతం పనులు పూర్తి అయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేసి లబ్ధిదారుకు వెంటనే అందించాలని సిపిఐ పార్టీ అభ్యర్థులు మండల తాహసిల్దార్ హసీనా సుల్తానా కు వినతి పత్రం సమర్పించారు. హిందూపురం సిపిఐ పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం ఇస్తున్న 1,80,000 ఏమాత్రం సరిపోవని లబ్ధిదారులకు ఐదు లక్షలకు పరిహారం పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో రెండున్నర సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇల్లు నిర్మాణం కోసం కేటాయించాలన్నారు. ఈకార్యక్రమలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, పట్టణ కార్యవర్గ సభ్యులు డి.బాబు, మారుతీ రెడ్డి, జబివుల్ల, లక్ష్మీనరయన, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వారాహి యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ధర్మవరం : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారానికై ఈనెల 14న వారాహి యాత్రను ప్రారంభిస్తున్నారని ఈ వారాహి యాత్రను ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనలో జరిగిన దౌర్జన్యాలు, దాడులు, భూ కబ్జాలు, అక్రమాలను, ఈ యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేయడమే మా లక్ష్యం అని వారు తెలిపారు. ఈ యాత్ర ఉభయ గోదావరి జిల్లాలో అన్నవరం నుంచి సత్యనారాయణ స్వామిని దర్శించుకుని ఈ వారాహి యాత్రను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.ఈ యాత్రలో రాయలసీమ నుంచి కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇదే రోజు సాయంత్రం బహిరంగ సభ కూడా ఉంటుందని తెలిపారు.తనకు పత్తిపాడు నియోజకవర్గానికి ఇన్చార్జిగా ఇచ్చారని ఇందుకు పవన్ కళ్యాణ్‌కు, నాదేండ్ల మనోహర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు.

వేరుశెనగను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: ఖరీఫ్ సీజన్ సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసిన విత్తన వేరుశెనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడిఏ సత్యనారాయణ తెలిపారు.స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన వ్యవసాయ శాఖ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేరుశనగ సాగుతో పాటు రైతులు చిరుధాన్య పంటలైన కంది, పెసర తదితర పంటలు సాగు తప్పనిసరి చేయాలని, రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.ఈ సమావేశంలో అగ్రి అడ్వైస్ కమిటీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, ఏఓ ఇలియాజ్, సిబ్బంది సుధాకర, నరేంద్ర, పవన్, లలిత పాల్గొన్నారు.

తహసిల్దార్ గా హసీనా సుల్తానా

విశాలాంధ్ర - హిందూపురం : మండలం తహశీల్దారుగా హసీనా సుల్తానా గురువారం బాధ్యతలు చేప ట్టారు. రొళ్ల మండల తహశీల్దారుగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై హిందూ పురంకు వచ్చినట్టు తహసిల్దార్ తెలిపారు. గత కొంత కాలంగా మండల తాసిల్దార్ శ్రీనివాసులు బదిలీపై వెళ్లిన తర్వాత, ఇప్పటివరకు దాదాపు సంవత్సరం కాలం హిందూపురం మండలంలో ఇంచార్జ్ తహలార్లో కొనసాగారు. మండలంలోని ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు.బాధ్యతలు స్వీకరించిన ఆసీనా సుల్తాన్ మాట్లాడుతూ,హిందూపురం అభివృద్ధికి అనుక్షణం కష్టపడతానని, ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే నేరుగా కార్యాలనుకొచ్చి తనని సంప్రదించవచ్చని తెలి పారు. బాధ్యతలు స్వీకరించిన తాసిల్దార్ హసీనా సుల్తానా కు సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

ఇంటి నిర్మాణాలు ప్రారంభించక పోతే పట్టాలు రద్దు చేస్తాం

విశాలాంధ్ర-లేపాక్షి: పేదల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో జగనన్న కాలినీలు ఏర్పాటు చేసి విలువైన ప్రభుత్వ స్థలాలను అందజేస్తే నిర్మాణాలు ఎందుకు చేయలేదని ఇల్లు కట్టకపోతే పట్టాలు తొలగించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం బిసల మానేంపల్లి లోని టోల్గేట్ వద్దన్న జగనన్న కాలనీ ని సబ్ కలెక్టర్ కార్తిక్ తో పాటు ఆయన పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల అధికారులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాలు కావస్తున్న ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు ఎందుకు నిర్మించుకోలేదని ఆరా తీశారు. విలువైన స్థలాలు పట్టాలుగా తీసుకొని కనీసం పునాదులు కూడా వేయకుండా నిర్లక్ష్యం చేసిన వారి పట్టాలను వెంటనే తొలగించాలని. చూడడానికి పునాదులు వేసిన వారిని కూడా వారం రోజుల్లో పూర్తిస్థాయి నిర్మాణాలు చేయకపోతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాల మౌలిక వసతులు కల్పించినప్పటికీ నిర్మాణాలు చేసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారులతో పనులు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కాలనీలో 210 సైట్లు ఏర్పాటు చేస్తే 37 మంది మాత్రమే హౌసింగ్ ద్వారా ఇల్లు మంజూరు చేయించుకున్నారని. అందులోనూ పూర్తి అయింది 7ఇల్లేనని మిగిలిన 30 వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని అధికారులు తెలియజేశారు. అయితే అక్కడికి వచ్చిన వారు మాత్రం ఇక్కడ పట్టాలు పొందిన చాలామందికి పెద్ద పెద్ద ఇల్లు ఉన్నాయని. లక్షలు విలువ చేసే ఈ స్థలాల కోసమే పేదల రంగు పూసుకున్నారని చర్చించుకోవడమే కాకుండా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి ఈ విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని మాట్లాడుకోవడం గమనార్హం. తహసిల్దార్ కాటం బాబు, ఎంపీడీవో నర సింహ నాయుడు, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ వాసంతి, సచివాలయ ఉద్యోగులు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు : జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించక పోతే వారి పట్టాలను రద్దు చేస్తామని పుట్టపర్తి ఆర్డిఓ భాగ్యరేఖ తెలిపారు. కొత్తచెరువు లోనే మూడు లే అవుట్ లో ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుగొండ రోడ్డు నందు ఉన్న 483 సర్వే నెంబర్లు 370 మందికి పైగా ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అయితే ఇందులో ఎక్కువ శాతం పునాదులకే పరిమితమయ్యాయి అని, వీటిని ఎందుకు లబ్ధిదారుల నిర్మించుకోలేదని అధికారులను ఆమె ప్రశ్నించింది. ఈ కాలనీకి రహదారి సమస్య ఉన్నందున వీటిని నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదన్నారు. ఇక్కడ ఇంటి నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని, అలా ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి పట్టాలు రద్దు చేయాలని ఆమె సూచించింది. 384.392 సర్వే నంబర్లలో ఇంటి నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి, డిప్యూటీ తాహసిల్దార్ స్వాతి, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, విఆర్వోలు శ్రీనివాసులు, వేణుగోపాల్, వీఆర్ఏలు శివ ప్రసాద్, సాయి, గంగాధర్ మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాహసిల్దార్ కు సన్మానం

విశాలాంధ్ర - అగళి : స్థానిక రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్ గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న జిలాని ను శుక్రవారం రెవిన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తాహసిల్దార్ కు పూలమాలతో శాలువా కప్పి సన్మానించారు. మండలంలో ప్రజలకు అందించిన సేవలను అధికారులు కొనియాడారు. రీలీవ్ అయి పెనుకొండ లోని సబ్ కలెక్టర్ కార్యాలయం సబ్ కలెక్టర్ కార్తీక్ కలిసి అనంతరం పుట్టపర్తి రెవిన్యూ డివిజన్ కార్యాలయం లో ఎ ఓ గా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిటి సుబ్బారావు, ఆర్ఐ గురన్న, వీఆర్వో లు నాగరాజు, దొడ్డేగౌడ్, నరసింహమూర్తి, కుమారి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు పనిచేయక ఇక్కట్లు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులో గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయం రెండు, మూడులో ఆధార్ కేంద్రాలను ప్రభుత్వము ఏర్పాటు చేసింది. గత రెండు నెలలుగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సర్వరు సమస్య రావడంతో వేలిముద్రలు పడకపోవడంతో ప్రతిరోజు లబ్ధిదారులు వచ్చి వెను తిరిగి పోతున్నారు. నూతన జిల్లా ఏర్పాటు కావడంతో ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈ కేంద్రాలకు ప్రజలు తరలివస్తున్నారు. అయితే ఇక్కడ పని చేయకపోవడంతో తీవ్రజాప్యం జరుగుతుంది. పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకున్న వారు లేరు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పుట్టపర్తి: మార్చి నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ మల్లికార్జున (ఏ ఆర్ పిసి-2081) కుటుంబానికి జిల్లా ఎస్పీ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కానిస్టేబుల్ సతీమణి అశ్విని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అడిషనల్ కార్పస్ ఫండ్ 1,00,000/రూ చెక్ ను అందజేయడం జరిగింది.అలాగే వారి కుటుంబానికి అందవలసిన ఇతర ఆర్థిక సహాయాన్ని కూడా వీలైనంత త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.వారి కుటుంబానికి పోలీస్ శాఖ నిరంతరం తోడుగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గారితో పాటు అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, ఏ ఆర్ డి ఎస్ పి విజయ్ కుమార్, ఏఓ సుజాత మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్ ర్యాంకర్లకు అవగాహన

విశాలాంధ్ర-ధర్మవరం: సాంకేతిక విద్యాశాఖ సంచాలకుల ఆదేశానుసారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి 20 నాలుగవ తేదీ వరకు ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాలిసెట్టు ర్యాంకర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జేవి.సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం రెండు వారాలపాటు ఉంటుందని ప్రతిరోజు నిపుణులచే పాలిటెక్నిక్ విద్య, ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు, వివిధ రకాల సౌకర్యాలు మొదలగు వాటి మీద అవగాహన కల్పించబడుతుందని తెలిపారు.పాలిసెట్ ర్యాంకర్లు అందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ఉచిత శిబిరమును సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట లో గల మున్సిపల్



బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 11వ తేదీ ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు నౌ జవాన్ సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, తౌఫీక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ అనంతపురం కిమ్స్ సవేరా హాస్పిటల్స్ సహకారంతో ఈ శిబిరంలో జిఆర్బిఎస్/ బిపి/ఈసీజీ/ 2డిఇ- ఎకో నిర్వహిస్తామని తెలిపారు. గుండె నొప్పి, ఛాతి నొప్పి, గుండె దడ, ఆయాసము, కళ్ళు తిరగడం, గుండెలో మంట కలగడం, చాతి బరువుగా ఉండడం, కాళ్లు వాపు రావడం,చెమటలు పట్టడం లాంటి సమస్యలకు చక్కటి వైద్య చికిత్సలను నిర్వహిస్తామని తెలిపారు. శిబిరమునకు వచ్చువారు ఆధార్ కార్డు జిరాక్స్ తో రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ భారీ, ఇస్మాయిల్, త, అమిర్ భాష తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

విశాలాంధ్ర - ధర్మవరం : మున్సిపల్ చైర్మన్ గా కాచర్ల లక్ష్మి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తొలుత శివానగర్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను చైర్మన్ కాచెర్ల లక్ష్మి, భర్త కాచర్ల అంజి నిర్వహించారు. ఈ పూజలో వైస్ చైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, మాజీ వైస్ చైర్మన్లు చంద్రమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ లతోపాటు పట్టణ వార్డు కౌన్సిలర్లు కూడా పాల్గొన్నారు. అనంతరం వందలాదిమంది అభిమానులు, శ్రేయోభిలాషులు, వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తల నడుమ భారీ ర్యాలీగా రావడం జరిగింది. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కేతిరెడ్డికి, మున్సిపల్ చైర్మన్ కాచెర్ల లక్ష్మికి అభిమానులు గజమాలలతో పూల వర్షముతో ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, కేరళ వాయిద్యాల నడుమ టపాసులను పేలుస్తూ, ర్యాలీని విజయవంతం చేయుటలో వారికి వారే సాటిగా నిలిచారు. అనంతరం చైర్మన్ కాచర్ల లక్ష్మి మాట్లాడుతూ ఈ చైర్మన్ పదవికి ఎమ్మెల్యే, కౌన్సిలర్ల సహకారంతో, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారాల అందించిన నాయకులకు కార్యకర్తలు ప్రోత్సాహం అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయమును చేయుటలో తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మార్గదర్శనముతో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్ల సహకారంతో పట్టణ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. వార్డు ప్రజలు తమకున్న సమస్యలను నేరుగా గాని, కౌన్సిలర్ల ద్వారా గాని తెలియజేస్తే పరిష్కరిస్తానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జ్ నాయకులు, వందలాదిమంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించండి

కలెక్టర్ పి.అరుణ్ బాబు

- హెచ్.డబ్ల్యూ ఓ.లు ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలి
- వసతి గృహాలను నిరంతరంగా పర్యవేక్షించాలి
- విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాలోని ఎస్సీ ,ఎస్టీ ,బీసీ సంక్షేమశాఖ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లోని విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ పి .అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ లోని స్పందన సమావేశ భవనంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మరియు వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన వసతి గృహాలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో రెండు రోజుల్లో గా అన్ని వసతి గృహాలను శుభ్రం చేయుటకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా హెచ్ డబ్ల్యు ఓ లు ప్రధాన కార్య స్థానాల కేంద్రంలోని నివాస ఉండాలని, సంబంధిత సంక్షేమ వసతి గృహ అధికారులందరూ తమ చిరునామా జాబితాను వారం రోజుల్లోగా తనకు , ఆయా సంక్షేమ వసతి గృహాల జిల్లా అధికారులందరికీ సమర్పించాలని విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని తాను కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని హాస్టల్లో ఆకస్మిక తనకి సమయంలో వీధిలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెండ్, క్రమం కేసు నమోదు లాంటి చర్యలు తీసుకొనుటకు వెనుకాడేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, వెనుకబడిన తరగతుల సాధికారత అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రాం , సహాయ సంక్షేమ అధికారులు వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



విశాలాంధ్ర-నల్లచెరువు: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన ప్రియతమ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిదని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రములోని సచివాలయం బి 1పరిధిలో జరిగిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సంక్షేమపథకాలు అమలుతీరును ఇంటింటా తిరుగుతూ లబ్ధిదారులకు పత్రాలను అందించారు.సత్వరమే పరిష్కారం కాని సమస్యలను పై అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించే విధంగా ఆదేశించారు. మాజీ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఇస్మాయిల్, ఎంపీపీ రమణారెడ్డిఎంపిడివో శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, కార్యదర్శి వసుందర, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సర్పంచులు సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్ రెడ్డి, యువ నాయకులు సానే హరినాథ్ రెడ్డి, సింగల్ విండో ప్రెసిడెంట్ జయచంద్రారెడ్డి, ఎంపీటీసీలు సుమియ, భాస్కర్ రెడ్డి, నరసింహరెడ్డి, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధిలు, వాలింటర్లు, పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోని ప్రతి గడపకు తీసుకెళ్లండి

విశాలాంధ్ర-ధర్మవరం: టీడీపీ మేనిఫెస్టోని ప్రతి గడపకు తీసుకెళ్లాలని నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని వారు నిర్వహించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వైసీపీ పై యుద్ధానికి సన్నద్ధం కావాలని, ఎవరో చెప్పే మాటలు వినవద్దని, ధర్మవరంలో టిడిపి జెండా ఎగురు వేసేందుకు అందరూ సైనికుళ్ళ పని చేయాలని వారు తెలిపారు. ఇకనుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు నిత్యం ప్రజల్లోనే ఉండాలని పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మల్లికార్జున, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, మారుతీ ప్రసాద్, సాహెబ్బి, బిబి, కృష్ణాపురం జమీర్ అహ్మద్, అంబటి సనత్, మారుతి స్వామి, భీమినేని ప్రసాద్ నాయుడు చిగిచెర్ల ఓబుల్ రెడ్డి, పని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర వాసులకు గ్యారంటీ పథకాలను వర్తింపజేయాలి

విశాలాంధ్ర - అగళి : కర్ణాటక ప్రాంతం లో స్థిర పడిన అంతరాష్ట్ర వాసులకు కర్ణాటక ప్రభుత్వం అమలు పరుస్తున్నా గ్యారంటీ పథకాలను వర్తింపజేయాలనీ మంత్రి సతీష్ జరిహోళి కర్ ను అంతర్రాష్ట్ర కోఆర్డినేటర్ మంజునాథ్ కలిసి విన్నవించారు.30 సంవత్సరాలుగా ఓటమి ఎరగని ప్రజా నాయకుడు సతీష్ జరికి హెూళి విజయం సాధించి మంత్రి ప్రమాణ స్వీకారం చేసిన సతీష్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం అంతర్ రాష్ట్ర కోఆర్డినేటర్ అగళి మంజునాథ్ మడకశిర అనిల్ మంత్రి ని కలిశారు.కర్ణాటక ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఇతర రాష్ట్ర వాసుల వర్తించదు అని ప్రభుత్వ నియమం ను ఎత్తివేయాలని కోరారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీ సత్య సాయి అనంతపురం కర్నూలు జిల్లా వాసులు ఉపాధి కోసం బెంగళూరు కర్ణాటక ఇతర నగరాల్లో స్థిరపడ్డారని బెంగళూరు నగరంలో గార్మెంట్స్ లో పనిచేయడానికి ఎంతోమంది మహిళలు ఉపాధి కోసం వెళ్లారని వీరికి అంతర్రాష్ట్రవాసులుగా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వర్తించదని ప్రభుత్వం పేర్కొనడం సమంజసం కాదన్నారు.ప్రభుత్వం పునరాలోచన చేసి కర్ణాటక రాష్ట్రంలో నివసిస్తున్న ఇతర రాష్ట్ర వాసులకు కూడా గ్యారెంటీ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వ దృష్టికి తెలియజేసి సహకారం చేయవలసిందిగా మంత్రి విన్నవించడం జరిగిందన్నారు.

వైయస్సార్ బీమాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కదిరి: వైయస్సార్ భీమాను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవోఅంజనప్ప ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం కదిరి మండలం కాలసముద్రం గ్రామంలో వైయస్సార్ బీమా సర్వేలో గ్రామ ప్రజలకు బీమా యొక్క ఆవశ్యకత గురించి తెలియజేశారు. వైయస్సార్ బీమా 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల లోపు ఉన్నవారందరూ బీమా చేసుకోవడం వలన సహజ మరణం సంభవించినట్లయితే లక్ష రూపాయలు, 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాలలో ప్రమాదశాత్తు మరనించిన వారికి ఐదు లక్షల రూపాయలు వైయస్సార్ బీమా కింద అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో మొత్తం రేషన్ కార్డులు 11,850 ఉంటే ఇప్పటివరకు 7,918 కార్డులకు వైఎస్ఆర్ బీమా సర్వే చేయడం జరిగిందని తెలిపారు.మిగిలిన వాటిని కూడా పదో తేది లోపు పూర్తి చెయ్యాలని వెల్ఫేర్ అసిస్టెంట్ కి ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కుటాగుల సబ్ స్టేషన్ లో 132 కె.వి మెయింటినెన్స్ కారణంగా మరమ్మతులు నిర్వహిస్తారని, ముదిగుబ్బ మండల వ్యాప్తంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ చంద్రనాయక్ తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-పరిగి: పరిగి మండలం కొడిగేనాహల్లి గ్రామంలో గత నెల రోజులుగా నిర్విరామంగా నిర్వహిస్తున్న పెంకాక్ సిలట్, కరాటే, యుద్ధ కలల వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు అందించి ముగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ ఎస్పీ కరస్పాండెంట్ కే శ్రీధర్ మాట్లాడుతూ వేసవి సెలవులను చిన్నారులు టీవీలు, సెల్ ఫోన్లతో తన విలువైన సమయాన్ని వృధా చేయకుండా ఆటలు,పాటలు, కరాటే తదితర విద్యాలయం నేర్చుకొని వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, అంతేకాకుండా విద్యార్థినీ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండడానికి ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణ పొందిన చిన్నారులను అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సౌజన్యంతో జారీ చేయబడిన ప్రశంసా పత్రాలను అందజేశారు.కోచ్ జనార్దన్ రెడ్డి, ఆంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నాం

టీడీపీ నాయకునికి పరామర్శ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : టీడీపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీ పంచాయతీ రాజ్ చాంబరు రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ ను ఆసుపత్రిలో శుక్రవారం ఛాంబరు సభ్యులు పరామర్శించారు. ఇటీవల బాబు రాజేంద్రప్రసాద్ గుండెపోటుకు గురై విజయవాడ రమేష్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఛాంబర్ సభ్యులు ఆకాంక్షించారు. మాజీ ఎంపీపీ, ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబరు సభ్యులు ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, వసుధ తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు.

ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - పెనుకొండ : పట్టణమునందు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు బదిలీపై వచ్చిన ప్రధానో పాధ్యాయురాలు పద్మప్రియ శుక్రవారం పాఠశాల నందు బాధ్య తలు స్వీకరించారు. ఈమె హిందూపురం నుంచి పెనుకొండకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్నటువంటి ప్రధానోపాధ్యా యుడు చంద్రశేఖర్ ఉరవ కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆమెకు పాఠశాల సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు వేణుగోపాల చార్యులు,వెంకటశ్రీనివా సులు,విజయ నాయక్,రమేష్,సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కోఆర్డినేట్ కమిటీ సభ్యుడు నియామకం

విశాలాంధ్ర-కదిరి: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కోఆర్డినేట్ కమిటీ సభ్యులుగా నచ్చు బాల కృష్ణ యాదవ్ ఎన్నిక య్యారు. శుక్రవారం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టి కదిరి అసెంబ్లీ కోఆర్డినేట్ కమిటీ సభ్యుడుగా నియామకం చేసిన ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు సుధాక కు కృతజ్ఞతలు తెలియచేసారు. నియోజకవర్గం లోని కదిరి, నల్లచెరువు, తనకల్లు, నంబూల పూల కుంట, తలుపుల, గాండ్ల పెంట మండలలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను, నాయకులను, కార్యకర్తలను సమన్వయం పరచుసుకోని కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేసి పార్టిని బలోపేతం చే స్తామని తెలియజేశారు.